RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 31 అక్టోబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:131

ప్రజాబలం

31 అక్టోంబర్ 2026 శనివారం

రాజకీయ మనుగడగా నిత్యావసరాలు

రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలేందుకు పెద్ద పెద్ద సమస్యలో లేదా సిద్ధాంతపరమైన విభేదాలో అవసరం లేదు. సగటు సామాన్యుడి రోజువారీ కిచెన్ బడ్జెట్ తలకిందులైతే చాలు! కడుపు నిండా తినే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు, ప్రజల్లో వ్యక్తమయ్యే ఆగ్రహం నేరుగా పాలకపక్షాల గ్రాఫ్‌ను వేగంగా పడదోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఎల్ నినో తీవ్రత వల్ల ఏర్పడిన అకాల వర్షాలు, పండగల రద్దీ, వాతావరణ మార్పుల ధాటికి ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధరల మంట ప్రజావ్యతిరేకతగా మారకముందే అదుపుచేసేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రూ.కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడుతుండటం ఆసక్తికరమైన రాజకీయ సమీకరణగా మారింది.ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యుడిని కాపాడేందుకు ప్రత్యేక కౌంటర్లు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. నెలకు సుమారు రూ. 100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్, రూ.25కే గోధుమపిండి అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా అందుబాటులోకి తెస్తూ మార్కెట్ ధరలపై ఒత్తిడి పెంచి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల అసంతృప్తిని చల్లబరిచేందుకు ఏకంగా రేషన్ కార్డుదారులకు ప్రత్యేక నిత్యావసరాల కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర వంటి 6 రకాల నిత్యావసరాలతో కూడిన సబ్సిడీ కిట్లను అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బహిరంగ మార్కెట్లో ధరలను విచ్చలవిడిగా పెంచే వ్యాపారుల నిర్బంధ తనిఖీలతో పాటు, ప్రభుత్వం నేరుగా ఈ సబ్సిడీ కిట్లను ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుకూలత తెచ్చుకోవాలని భావిస్తోంది.ఆర్థికంగా తీవ్ర లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్ణకై ఇంత భారీగా నిధులు వెచ్చించడానికి ప్రధాన కారణం ఓటు బ్యాంకు ముప్పు! ఉచిత పథకాలు ఎంత అందజేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి పాకెట్ మనీ ఖాళీ అయిపోతుంది. దీనివల్ల ప్రభుత్వాల సంక్షేమ పథకాల ఇంపాక్ట్ సున్నాగా మారి, హామీలు ఇచ్చారు కానీ పొట్ట నింపడం లేదు అనే నిరసన స్వరం గ్రామాల్లో బలంగా వినిపించే ప్రమాదం ఉందనేది పొలిటికల్ సర్వేల హెచ్చరిక. ఈ నిత్యావసరాల ధరల నియంత్రణ అంశం రెండు ప్రభుత్వాలకు సంజీవనిలా మారనుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతరం నిఘా ఉంచడం, లభ్యత కొరత రాకుండా ముందస్తుగా దిగుమతులు చేసుకోవడం ద్వారా ప్రజాసంతోషాన్ని కాపాడుకోవడమే ఏపీ, తెలంగాణ సీఎంల ప్రధాన అజెండా.జాతీయ, అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన నిత్యావసరాల కొరతను కేవలం పరిపాలనా సమస్య గా చూడకుండా, 'రాజకీయ మనుగడ' సమస్యగా భావించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు భారాన్ని తమ భుజాన వేసుకోవడం రాజకీయంగా అత్యంత వ్యూహాత్మకమైన అడుగుగా భావించవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

ఇస్రో మరో ఘనత.. నింగిలోకి దూసుకెళ్లిన ఎన్‌వీఎస్-03 శాటిలైట్

ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో

భారత నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ'కి పెరగనున్న బలం

కనీస కార్యాచరణకు అవసరమైన 4 ఉపగ్రహాల మైలురాయి పూర్తి

దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారం ఈ ఉపగ్రహంలో మరో ప్రత్యేకత

పౌర, సైనిక అవసరాలకు స్వదేశీ నావిగేషన్ సేవలు బలోపేతం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ' (ఘిజ×జ)ను బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం రాత్రి 11:51 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది.

ప్రయోగం జరిగిన దాదాపు 20 నిమిషాల తర్వాత, 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ విజయవంతంగా నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు.

ఈ ప్రయోగ విజయంతో, నావ్‌ఐసీ వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీస నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఇది దేశీయ స్థాననిర్ణయ, నావిగేషన్, టైమింగ్ (పీఎన్‌టీ) సేవలకు భరోసానిస్తుంది. ఈ ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం మరో విశేషం. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతో పాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. దీనివల్ల భారత భూభాగంతో పాటు, దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

గతంలో మొదటి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు రావడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో విఫలం కావడం వంటి అడ్డంకులను అధిగమించి ఇస్రో ఈ విజయాన్ని సాధించింది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్‌వీ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం.

ప్రస్తుతం ఉపగ్రహం తన ఆన్‌బోర్డ్ ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలు చేపడుతుంది. అనంతరం తుది పరీక్షల తర్వాత ఇది నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తు నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతో పాటు, సైనిక వ్యూహాత్మక అవసరాలకు కూడా నావ్‌ఐసీ వ్యవస్థ అత్యంత కీలకం కానుంది.

సౌదీ అరేబియాకు విమానాలు రద్దు చేసిన ఎయిర్ ఇండియా

భద్రతా కారణాలతో నవంబర్ 14 వరకు సర్వీసులు నిలుపుదల

జెడ్డా, రియాద్, దమ్మామ్‌కు వెళ్లే విమానాలపై ప్రభావం

ప్రయాణికులకు టికెట్ రీఫండ్ లేదా రీబుకింగ్ అవకాశం

సౌదీ విమానాశ్రయాలపై దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం

ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు సౌదీ అరేబియాకు తమ విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. సౌదీలోని జెడ్డా, రియాద్, దమ్మామ్ నగరాలకు వెళ్లే, అక్కడి నుంచి బయల్దేరే అన్ని విమానాలను నవంబర్ 14 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థలు పేర్కొన్నాయి.

ఈ నిర్ణయంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు విమానయాన సంస్థలు రెండు ప్రత్యామ్నాయాలను సూచించాయి. నవంబర్ 14 వరకు ప్రయాణించేందుకు అక్టోబర్ 30 లేదా అంతకంటే ముందు టికెట్లు బుక్ చేసుకున్న వారు, ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా తమ ప్రయాణ తేదీని ఒకసారి మార్చుకోవచ్చు. లేదా టికెట్ రద్దు చేసుకుని పూర్తి నగదు వాపసు (రీఫండ్) పొందవచ్చు. తేదీ మార్చుకోవాలనుకునే వారు నవంబర్ 29 లోపు ప్రయాణించేలా టికెట్లు రీబుక్ చేసుకోవచ్చని, అయితే ఇది సీట్ల లభ్యతపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశాయి.

ఇటీవల సౌదీ అరేబియాలోని పౌర సదుపాయాలపై, ముఖ్యంగా రియాద్, దమ్మామ్ విమానాశ్రయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దమ్మామ్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒక భారతీయుడు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సౌదీలో చిక్కుకుపోయిన భారతీయ యాత్రికులను, ముఖ్యంగా ఉమ్రా యాత్రికులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే వందలాది మంది ఉమ్రా యాత్రికులు భారత్‌కు చేరుకున్నట్లు సమాచారం.

రూ. 26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసు.. హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల్లో ఈడీ సోదాలు

అల్లంరాజు సత్యనారాయణమూర్తి ఆస్తులే లక్ష్యంగా దాడులు

భారీగా నగదు, రూ. 5 కోట్ల విలువైన స్థిరాస్తులు గుర్తింపు

అధిక లాభాల ఆశ చూపి వెబ్‌సైట్ ద్వారా మోసం చేసినట్లు ఆరోపణలు

సైబర్ మోసానికి సంబంధించిన భారీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. అల్లంరాజు సత్యనారాయణమూర్తికి చెందిన మూడు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని ఎర్నాకుళం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.

కేసు వివరాల ప్రకారం.. నిమేష్ అనే వ్యక్తిని ఫోన్ కాల్స్, టెలిగ్రామ్ సందేశాల ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సంప్రదించి, అధిక లాభాల పేరుతో ప్రలోభపెట్టారు. ఝుజూఈఝుశ్రీఙఇ.ఴశీఎ అనే వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే భారీ రాబడి లభిస్తుందని నమ్మించారు. వారి మాటలను విశ్వసించిన బాధితుడు, 2023 మే నుండి 2024 మే మధ్య కాలంలో సుమారు రూ. 26.02 కోట్లను నిందితులు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే, పెట్టిన పెట్టుబడి గానీ, లాభాలు గానీ తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో ఒక విల్లా ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది.

తాజాగా నిర్వహించిన సోదాల్లో అధికారులు కీలక పత్రాలను, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. రూ. 6.40 లక్షల నగదును సీజ్ చేయడంతో పాటు, 11 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 14 లక్షల నగదును స్తంభింపజేశారు. వీటితో పాటు దాదాపు రూ. 5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా వంటి స్థిరాస్తులను గుర్తించినట్లు ఈడీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది.

RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 31 అక్టోబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:131

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు ,భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన

,కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు

భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

సింగరేణి కార్మికులకు మరో బోనస్.. ఒక్కొక్కరికి రూ.1.10 లక్షలు!

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించిన ప్రభుత్వం

ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.10 లక్షల చొప్పున చెల్లింపు

నవంబర్ 5న కార్మికుల ఖాతాల్లోకి రూ. 419 కోట్లు జమ

దసరా, దీపావళి బోనస్‌లు కలిపి

ఒక్కో కార్మికుడికి రూ. 2.65 లక్షల లబ్ధి

సుమారు 38,000 మంది కార్మికులకు ప్రయోజనం

తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మరో శుభవార్త అందించింది. ఇటీవల దసరా పండుగ సందర్భంగా భారీ బోనస్ అందుకున్న కార్మికులకు, ఇప్పుడు దీపావళి కానుకగా మరో భారీ బోనస్‌ను ప్రకటించింది. దీని కింద ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం రూ. 419 కోట్లను చెల్లించనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 38,000 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు.

నెల రోజుల వ్యవధిలోనే సింగరేణి కార్మికులు రెండు భారీ బోనస్‌లు అందుకోనుండటం విశేషం. ఇటీవల దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.54 లక్షల వరకు చెల్లించారు. ఇప్పుడు ప్రకటించిన దీపావళి బోనస్‌తో కలిపి, కేవలం రెండు పండుగలకు ఒక్కో కార్మికుడు సగటున/గరిష్ఠంగా రూ. 2.65 లక్షల వరకు ప్రయోజనం పొందనున్నారు. ఈ రెండు బోనస్‌ల కోసం సింగరేణి సంస్థ మొత్తంగా రూ. 1,020 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇది కార్మికుల పట్ల యాజమాన్యం నిబద్ధతను తెలియజేస్తోంది.

ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తాన్ని నవంబర్ 5వ తేదీన నేరుగా అర్హులైన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సంబంధిత విభాగాలను ఆదేశించారు.

ఈ బోనస్ నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (NCWA) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుందని, అధికారులకు ఇది వర్తించదని యాజమాన్యం స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల్లో కనీసం 190 రోజులు, ఓపెన్‌కాస్ట్ గనులు లేదా సర్ఫేస్ విభాగాల్లో 240 రోజులు పనిచేసిన వారికి పూర్తి బోనస్ లభిస్తుంది. కనీసం 30 రోజులు పనిచేసిన వారికి, వారు పనిచేసిన దినాల నిష్పత్తి ప్రకారం బోనస్ చెల్లిస్తారు.ఒకదాని తర్వాత ఒకటిగా రెండు భారీ బోనస్‌లు ప్రకటించడంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వారిలో పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలి

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని కోరిన రేవంత్ రెడ్డి

ఢిల్లీ: తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు.

ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్ -- కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ) వెంటనే మంజూరు చేయాలని కోరారు.

వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి వివరించారు.

హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (RRR) పక్కనే రీజినల్ రింగ్ రైలుకు కూడా అలైన్‌మెంట్ చేయాలని ముఖ్యమంత్రికోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

డోర్నకల్– గద్వాల్, కల్వకుర్తి -- మాచర్ల, కాచిగూడ --జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు -- ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ -- లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని అశ్వినీ వైష్ణవ్ ని కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409.1 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ, మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి , డాక్టర్ మల్లు రవి బలరాం నాయక్ గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి , గడ్డం వంశీకృష్ణ , ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు

విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు

71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం (డీఏ), కరువు ఉపశమనం (డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది.కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా..

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది.

ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

వార్తా 4 లో

జర్మనీతో తెలంగాణ బంధం మరింత బలోపేతం కావాలి

అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు

జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని రాష్ట్ర క్రీడా , యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు.

భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు.

హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు.

అధునాతన తయారీ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఐటీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. జర్మనీలోని థ్యూరింగియా రాష్ట్రంతో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారం పెరుగుతోందని వివరించారు.

తెలంగాణ సంస్కృతి, పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెలంగాణకు గొప్ప చరిత్ర, విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల నిర్మాణ వైభవం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, హైదరాబాద్ చారిత్రక కట్టడాలు రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు, చేనేత, హస్తకళలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని చెప్పారు.

హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, జర్మనీతో వంటకాల పండుగలు, చెఫ్‌ల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సాంస్కృతిక సంబంధాలను మరింత పెంపొందించవచ్చన్నారు.

హైదరాబాద్‌తో పాటు వరంగల్ కాకతీయ వారసత్వ సంపద, రామప్ప దేవాలయం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, సరస్సులు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, సంప్రదాయ గ్రామాలను సందర్శించాలని జర్మనీ పర్యాటకులకు మంత్రి ఆహ్వానం పలికారు.

50 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణను దేశంలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025--2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

పాలసీ తొలి సంవత్సరంలోనే 22,174 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హోటళ్లు, రిసార్టులు, వారసత్వ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, ఆతిథ్య రంగ విద్యలో పెట్టుబడులు పెట్టాలని జర్మనీ సంస్థలకు పిలుపునిచ్చారు. భారత్--జర్మనీ మధ్య 75 ఏళ్ల స్నేహబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తూ, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత దృఢపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
ప్రధాన రహదారులన్నీ జలమయం
పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.

ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు.

ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

హైదరాబాద్‌కు జనవరి నుంచి 8 నెలల పాటు భారీ నీటి కష్టాలు: జలమండలి ఎండీ వార్నింగ్

భాగ్యనగరానికి తాగునీటి గండం
మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నుంచి 100 MGD నీటి కొరత అంచనా
హైదరాబాద్‌లో 7 నియోజకవర్గాలపై నీటి సంక్షోభ ప్రభావం

హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల (ఎం.జి.డి) నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు. ప్రాజెక్టులలో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి 100 ఎం.జి.డి, కృష్ణా నది నుంచి 10-15 ఎం.జి.డి, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 ఎం.జి.డి నీటిని నగరానికి తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా 60 శాతం కొరతను భర్తీ చేయగలిగినా, మరో 20 నుంచి 40 శాతం నీటి ఎద్దడి కొనసాగుతుందని ఆయన అంగీకరించారు.

ఈ నీటి సంక్షోభం ప్రభావం నగరంలోని ఏడు నియోజకవర్గాలపై అధికంగా ఉంటుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య ఉండొచ్చని అంచనా వేశారు. అలాగే పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు ఉన్న ప్రాంతాల్లో సుమారు 3 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (SDRF), ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్ష్ సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రెండు నిమిషాల్లోనే తెగిన సంబంధాలు

చమోలీ ఎస్పీ సుర్జీత్ సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణూ) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది.

సంస్థ సేవలు నిలిపివేత

ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

క్రైస్తవ సమాజానికి ఎమ్మెల్సీ, గవర్నర్ కోటాలో ప్రాతినిధ్యం కల్పించాలి

దీపక్ జాన్ సేవలను గుర్తించి సముచిత స్థానం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి

హైదరాబాద్: తెలంగాణలో క్రైస్తవ సమాజం శాంతి, సుభిక్షాలతో జీవించేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర క్రైస్తవ సమాజం తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, రాబోయే ఎమ్మెల్సీ నియామకాల్లో క్రైస్తవులకు కనీసం రెండు స్థానాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిలో క్రైస్తవ సమాజానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. హైదరాబాద్‌లో క్రైస్తవులు తీవ్రంగా ఎదుర్కొంటున్న శ్మశానవాటికల స్థలాల కొరతను పరిష్కరించాలని, అవసరమైన చోట సమాధుల స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న వివిధ కార్పొరేషన్లు, చట్టబద్ధ సంస్థలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో విద్యావంతులైన క్రైస్తవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిలో క్రైస్తవ సమాజం అందిస్తున్న సేవలను గుర్తించి, భవిష్యత్తులోనూ వారి భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సమాజం తరఫున దీపక్ జాన్ అభ్యర్థిత్వాన్ని ముఖ్యమంత్రి పరిశీలించాలని నాయకులు కోరారు. ఆయన గతంలో చేసిన సేవలను గుర్తించి, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవితో పాటు సముచితమైన బాధ్యతను అప్పగించడం ద్వారా క్రైస్తవ సమాజానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

జంగాలపల్లి గుట్టను టేబుల్ మౌంటెన్ తరహాలో అభివృద్ధి చేసేందుకు పరిశీలన.

రామప్పలో రూ.13 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి.

గ్రామాల్లో పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్.

ఉపాధి కోరిన వారందరికీ జాబ్‌కార్డులు.. పని కల్పించాలి.

మంత్రి దనసరి అనసూయ సీతక్క.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 30శుక్రవారం ములుగు నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని తన స్టేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాలతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, పర్యాటక అభివృద్ధి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గ్రామీణ ఉపాధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించి, కొనుగోళ్లలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అటవీ అనుమతుల కారణంగా ముందుకు సాగని మారుమూల గ్రామాల రహదారి పనులపై సమీక్షించారు.

జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సమన్వయంతో జిల్లా స్థాయి కమిటీ ద్వారా అనుమతుల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏ ద్వారా ఇప్పటికే మంజూరైన రహదారి పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, గత రెండు రోజులుగా ములుగు జిల్లాలో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు జిల్లా అభివృద్ధిపై సమీక్షించినట్లు తెలిపారు. జంగాల్‌పల్లి గుట్టకు దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో తాము సందర్శించిన టేబుల్ మౌంటెన్‌ను పోలిన ఆకృతి ఉందని వివరించారు. గుట్టపై నుంచి ఒకవైపు లక్నవరం, మరోవైపు రామప్ప కనిపించే మంచి వ్యూ పాయింట్ ఉన్నందున పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌లు, ఇతర నిపుణులను ఆహ్వానించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

రామప్పలో రూ.13 కోట్లతో ఐలాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కొత్త డిజైన్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లాలో వెలుగులోకి వస్తున్న గుహలు, గుట్టలు, కోటలు, పురాతన ఆలయాలను పరిరక్షిస్తామని పేర్కొన్నారు. పాత కట్టడాలకు భంగం కలగకుండా కొత్త నిర్మాణాలు చేపడతామని చెప్పారు.

గ్రామ సమగ్ర ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో ఉన్న వనరులు, చేపట్టాల్సిన పనులు, మంజూరైన పనుల పురోగతి తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. పనులకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా వాటి స్థితిని పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఏ గ్రామానికి ఏ పనులు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎందుకు పూర్తి కాలేదనే వివరాలను తాను, సంబంధిత కార్యదర్శి, కమిషనర్ నేరుగా తెలుసుకొని అధికారులతో మాట్లాడేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు.

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంతోపాటు గ్రామాల్లో ఆస్తులను సృష్టించేందుకు ఉపాధి హామీ పథకంలో 375 రకాల పనులు చేపట్టవచ్చని వివరించారు.

వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రంథాలయాలు, పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, వివాహ కార్యక్రమాల కోసం రూ.15 లక్షలతో భవనాలు నిర్మించుకోవచ్చని తెలిపారు. చెరువుల్లో పూడికతీత, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మట్టి రోడ్లు, వ్యవసాయ క్షేత్రాలకు రహదారులు వంటి పనులు చేపట్టవచ్చన్నారు. బీటీ రహదారులను కూడా రూ.1,000 నుంచి రూ.1,500 కోట్లతో చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు.

సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు ఉపాధి పనుల్లో చురుగ్గా వ్యవహరించాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచడం ద్వారా మరిన్ని మెటీరియల్ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రెండు నెలలకు పనులను మార్చుకుంటూ, ఒక్కోసారి 30 నుంచి 40 రకాల పనులు చేపట్టాలని సర్పంచులకు సూచించినట్లు తెలిపారు.

ఇప్పటికే రెండుసార్లు నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించామని, ఐటీడీఏ అధికారులు, సర్పంచులతో కలిసి దాదాపు 23 వేల మంది పాల్గొన్నట్లు చెప్పారు. పనుల సమన్వయానికి ఎంపీడీవో చైర్మన్‌గా మండల స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కరువు కాలంలో ఉపాధి కోరిన వారందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి పని కల్పించాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పని దొరకలేదనే పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులను గుర్తించి, పనుల సంఖ్యను పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సందర్భంలోనూ సూచిస్తున్నారని తెలిపారు. తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో విస్తృత ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కొత్త రహదారుల నిర్మాణం, విద్యుత్ లైన్ల మార్పు, పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏ ప్రాంతంలో ఎందుకు నీటి సరఫరా నిలిచిందనే విషయాన్ని సంబంధిత వాట్సాప్ గ్రూపులు, పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.

తాగునీటి సమస్యలపై వాస్తవాలను తెలియజేస్తే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని, అవాస్తవ ప్రచారం చేయవద్దని మంత్రి కోరారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, డీఆర్‌డీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనిలేక తిరుగుతున్నానా?

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర

ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక

నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్

డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలింపేతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు.

పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. “డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా” అని ఆయన స్పష్టం చేశారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.

అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా.. మళ్లీ మారిన షెడ్యూల్

ఏపీ, తెలంగాణలో మళ్లీ మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్

రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడి

సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

తెలంగాణలో నవంబర్ 26, ఏపీలో నవంబర్ 20 వరకు పొడిగించిన అభ్యంతరాల గడువు

తెలంగాణలో 2.59 కోట్లు, ఏపీలో 42.55 లక్షల ఓటర్ల పేర్లకు తుది జాబితాలో చోటు

రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోల) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది.

ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలో నవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 20 వరకు పొడిగించింది.

వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది.

సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది.

గణాంకాల వివరాలు

ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల (ASDD) కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు. అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గాను 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు.

ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో ధరలు ఇలా!

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

10 గ్రాముల బంగారంపై రూ.1,690 వరకు పతనం

హైదరాబాద్‌లో రూ.1,42,260కి చేరిన 24 క్యారెట్ల బంగారం

కిలో వెండిపై రూ.5,000 మేర తగ్గుదల

శుక్రవారం ఉదయం భారత మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీ పతనమయ్యాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పసిడి, వెండి ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. ప్రముఖ వెబ్‌సైట్ ‘గుడ్‌రిటర్న్స్’ వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఈ ధరల తగ్గుదల నమోదైంది. హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,690 తగ్గి రూ.1,42,260కి చేరింది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,550 మేర తగ్గి రూ.1,30,400 వద్ద స్థిరపడింది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,06,690గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాలైన వరంగల్, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మంలలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.బంగారం బాటలోనే వెండి ధర కూడా భారీగా పతనమైంది. హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో కిలో వెండి ధరపై ఏకంగా రూ.5,000 తగ్గి రూ.2,10,000కు చేరింది.దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,410గా ఉండగా, చెన్నైలో 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,06,670 వద్ద కొనసాగుతోంది. అయితే, బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని, వినియోగదారులు తాజా ధరలను నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉపాధి హామీ లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు కలెక్టర్ సత్య ప్రసాద్

పెగడపల్లి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడం తో పాటుగా జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి నిరంతరం ఉపాధి కల్పించాలని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రాబోయే జూన్,జులై నెల వరకు ఉపాధి హామీ పనుల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉపాధి కల్పించేందుకు అదనపు పనులను గుర్తించి ముందస్తు అనుమతులు, మంజూరు పొందాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద సోక్ పిట్స్,ఫాం పాండ్స్, నర్సరీ ల ఏర్పాటు లాంటి పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని ఉపాధి హామీ లక్ష్యాల సాధనలో ఎవరు నిర్లక్ష్యం చేసిన సహించేది లేదని హెచ్చరించారు.గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంపొందించేందుకు పన్నుల వసూళ్ల పై దృష్టి పెట్టాలని కొన్ని మండలాల్లో పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చే మార్చి నాటికి అన్ని మండలాల్లో పన్నుల వసూళ్లు నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పన్నుల వసూళ్ల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆన్లైన్ లో నమోదు అయిన రికార్డులనే ప్రామాణికంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భాగస్వామ్య పౌరసత్వం: దేశ నిర్మాణంలో భారతీయ ముస్లింల పాత్ర

విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులు మరియు సంప్రదాయాలకు చెందిన ప్రజలతో, భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వైవిధ్యభరితమైన దేశాలలో ఒకటి. ఈ వైవిధ్యం శతాబ్దాలుగా అభివృద్ధి చెందింది, వివిధ వర్గాలు దేశ సామాజిక, ఆర్థిక, మేధో మరియు సాంస్కృతిక జీవితానికి దోహదపడ్డాయి. ఈ చరిత్రలో భారతీయ ముస్లింలు ఒక అంతర్భాగం. వాస్తుశిల్పం, సాహిత్యం, వాణిజ్యం, విద్య, ప్రజా పరిపాలన మరియు స్వాతంత్ర్య పోరాటంలో వారి సహకారాన్ని చూడవచ్చు. భారతదేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతున్న తరుణంలో, దేశ భవిష్యత్తులో భారతీయ ముస్లింలు ఎలా ఇమిడిపోతారు అనేదే ప్రశ్న కాదు, బలమైన, సమ్మిళితమైన మరియు సంపన్నమైన భారతదేశానికి వారు మరింతగా ఎలా దోహదపడగలరు అనేది అసలు ప్రశ్న.

భాగస్వామ్య పౌరసత్వం అనే భావన ఈ బాధ్యతను చూసేందుకు ఒక ముఖ్యమైన మార్గాన్ని అందిస్తుంది. దీని అర్థం ఏమిటంటే, మతం, భాష, కులం లేదా ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయి. పౌరసత్వం అంటే కేవలం హక్కులను అనుభవించడం మాత్రమే కాదు. అది సమాజంలో పాలుపంచుకోవడం, ఇతరులకు సేవ చేయడం మరియు దేశ ప్రగతికి దోహదపడటం కూడా. భారతీయ ముస్లింలకు, దీని అర్థం విద్య, ఆర్థికాభివృద్ధి, సామాజిక సేవ, ప్రజా జీవితం మరియు సామాజిక సంక్షేమంలో చురుకైన పాత్ర పోషించడం.

సమాజం తమ వంతు సహకారం అందించగల అత్యంత ముఖ్యమైన రంగాలలో విద్య ఒకటి. నేటి భారతదేశంలో, మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలు మరియు నాయకత్వం కోసం విద్య అత్యవసరం. నాణ్యమైన విద్య, శాస్త్రీయ ఆలోచనా విధానం, వృత్తి విద్యా కోర్సులు మరియు సాంకేతిక నైపుణ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం యువతకు మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి సహాయపడుతుంది. ముస్లిం సమాజానికి చెందిన ఉపాధ్యాయులు, పరిశోధకులు, పండితులు మరియు వృత్తి నిపుణులు కూడా భారతదేశ మేధో మరియు ఆర్థిక వృద్ధికి ముఖ్యమైన తోడ్పాటును అందించగలరు. అందువల్ల, విద్యకు మద్దతు ఇవ్వడం కేవలం వ్యక్తులకు, కుటుంబాలకు మాత్రమే కాకుండా సమాజం మొత్తానికి ప్రయోజనం చేకూరుస్తుంది.

ఆర్థిక భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం. ముస్లిం పారిశ్రామికవేత్తలు, చేతివృత్తులవారు, వ్యాపారులు, వృత్తి నిపుణులు మరియు కార్మికులు దేశవ్యాప్తంగా స్థానిక ఆర్థిక వ్యవస్థలకు దోహదపడతారు. వ్యవస్థాపకత, నూతన సాంకేతికత, ఆవిష్కరణలు మరియు ఆధునిక నైపుణ్యాలకు అధిక మద్దతు ఇవ్వడం ద్వారా మరిన్ని ఉపాధి మరియు ఆర్థిక అవకాశాలను సృష్టించవచ్చు. యువతను వారి సమాజానికి సేవ చేస్తూ, విస్తృత ఆర్థిక వ్యవస్థకు కూడా దోహదపడే వ్యాపారాలు మరియు సంస్థలను స్థాపించడానికి ప్రోత్సహించవచ్చు. ఆర్థిక బలం ప్రజలు ప్రజా మరియు సామాజిక జీవితంలో మరింత ఆత్మవిశ్వాసంతో పాల్గొనడానికి కూడా వీలు కల్పిస్తుంది.

సామాజిక సేవ అనేది సహకారం అందించగల మరో ముఖ్యమైన రంగం. దానధర్మాలు మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఇస్లామిక్ బోధనలలో బలమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి, మరియు చాలా మంది వ్యక్తులు మరియు సంస్థలు ఇప్పటికే విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు సంక్షేమ రంగాలలో పనిచేస్తున్నారు. ఇటువంటి ప్రయత్నాలు సమాజ సరిహద్దులను దాటి ప్రజలను చేరుకున్నప్పుడు గొప్ప ప్రభావాన్ని చూపుతాయి. స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ మరియు నిరుపేద కుటుంబాలకు సహాయం వంటివి సమాజంలోని వివిధ వర్గాల మధ్య నమ్మకాన్ని మరియు సహకారాన్ని పెంపొందించడంలో సహాయపడతాయి. మత లేదా సామాజిక భేదాల కంటే కరుణతో నడిచినప్పుడు సమాజ సేవ మరింత అర్థవంతంగా మారుతుంది.

సమ్మిళిత భారతదేశానికి దాని విభిన్న వర్గాల మధ్య మరింత పరస్పర సహకారం కూడా అవసరం. బహుళత్వం అంటే కేవలం వివిధ వర్గాలు పక్కపక్కన నివసించడం మాత్రమే కాదు. దాని అర్థం ఒకరితో ఒకరు సంభాషించుకోవడం, కలిసి పనిచేయడం మరియు ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడం కూడా. భారతీయ ముస్లింలు ఎప్పటినుంచో భారతదేశ ఉమ్మడి సాంస్కృతిక, సామాజిక జీవితంలో భాగంగా ఉన్నారు. పరిసర ప్రాంతాలు, పాఠశాలలు, కార్యాలయాలు మరియు పౌర సంస్థలలో సంభాషణలు, నిరంతర పరస్పర సహకారం ద్వారా ఈ సంప్రదాయాన్ని బలోపేతం చేయవచ్చు. ప్రజలు ఒకరినొకరు వేర్వేరు సమూహాలుగా కాకుండా తోటి పౌరులుగా చూసుకున్నప్పుడు సామాజిక సామరస్యం పెరుగుతుంది.

రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం మరియు సౌభ్రాతృత్వం పట్ల తన నిబద్ధత ద్వారా ఈ ఉమ్మడి పౌరసత్వానికి ఒక ఉమ్మడి పునాదిని అందిస్తుంది. ఈ విలువలు రోజువారీ ప్రవర్తన ద్వారా అర్థవంతంగా మారతాయి. ఇతరుల గౌరవాన్ని గౌరవించడం, చట్టాన్ని అనుసరించడం, పక్షపాతాన్ని తిరస్కరించడం మరియు ప్రజాస్వామ్య జీవితంలో నిర్మాణాత్మకంగా పాల్గొనడం అనేవి పౌరులందరూ పంచుకోవాల్సిన బాధ్యతలు. ప్రతి ఇతర సమాజంలాగే, భారతీయ ముస్లింలు కూడా పౌర కార్యకలాపాలలో పాల్గొనడం, సంభాషణను ప్రోత్సహించడం మరియు యువతలో బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్య సంస్కృతిని బలోపేతం చేయగలరు. డిజిటల్ యుగం పౌరసత్వానికి మరో కోణాన్ని జోడించింది. సోషల్ మీడియా మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ప్రజలు ఒకరితో ఒకరు సంభాషించుకోవడానికి మరియు సమాచారాన్ని మార్పిడి చేసుకోవడానికి సులభతరం చేశాయి. అదే సమయంలో, తప్పుడు సమాచారం, మూస ధోరణులు మరియు విభజన కలిగించే కంటెంట్ ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాప్తి చెందుతాయి. అందువల్ల సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించడం ముఖ్యం. పౌరులు సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించుకోవాలి, దూషించే లేదా రెచ్చగొట్టే కంటెంట్‌కు దూరంగా ఉండాలి మరియు గౌరవప్రదమైన చర్చలలో పాల్గొనాలి.

భాగస్వామ్య పౌరసత్వం అనే భావన అంతిమంగా ఒక సరళమైన సూత్రంపై ఆధారపడి ఉంటుంది: ఏ సమాజం యొక్క పురోగతి అయినా దేశం మొత్తం పురోగతితో సన్నిహితంగా ముడిపడి ఉంటుంది. భారతీయ ముస్లింలకు గొప్ప వారసత్వం మరియు భారతదేశానికి సుదీర్ఘకాలంగా సేవలందించిన చరిత్ర ఉంది. విద్య, వ్యవస్థాపకత, మహిళల భాగస్వామ్యం, సామాజిక సేవ, సామాజిక సంబంధాలు మరియు రాజ్యాంగ విలువలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, వారు దేశ భవిష్యత్తుకు మరింత బలమైన సహకారాన్ని అందించగలరు. ఈ భాగస్వామ్యం సమాన పౌరసత్వానికి సహజమైన వ్యక్తీకరణ. సమ్మిళిత భారతదేశాన్ని కేవలం ప్రభుత్వాలు మాత్రమే నిర్మించలేవు. తమ సొంత పురోగతి దేశ పురోగతితో ముడిపడి ఉందని అర్థం చేసుకున్న పౌరులు దీనికి అవసరం. భిన్నత్వాన్ని గౌరవించే మరియు ప్రతి పౌరునికి గౌరవం, అవకాశం మరియు భారతదేశ ఉమ్మడి భవిష్యత్తుకు సహకరించడానికి సమానమైన అవకాశం లభించే సమాజమే లక్ష్యం కావాలి.

అల్తాఫ్ మీర్
పిహెచ్.డి జామియా మిలియా ఇస్లామియా

దూసుకుపోతున్న వైసీపీ జడ్పిటీసీ, ఎంపిటీసీ అభ్యర్థులు

దేవీపట్నం జడ్పిటీసీ అభ్యర్థిగా వైసీపీ తరఫున పోటీ చేస్తున్న కారం కృష్ణ, ఇందుకూరు ఎంపిటీసీ అభ్యర్థి ఒగ్గి సునంద ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండలం లోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి నెరవేర్చలేదని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వారు విమర్శించారు. ధరల పెంపుతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.వైసీపీ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి జరిగిందని, తమకు ఓటు వేసి గెలిపిస్తే నిర్వాసితుల సమస్యలతో సహా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని వారు హామీ ఇస్తున్నారు. వారి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

కోరుకొండలో ఆర్ అండ్ బీ అధ్వానం..

ఐదు నెలలకే ముక్కలైన బీటీ రోడ్డు ,నాణ్యతకు తూట్లు..

కోరుకొండ మండలం కోటి కేశవరం నుండి నాగం పల్లి నూతన బీటీ రోడ్ ఆర్ అండ్ బీ శాఖ నిర్మించిన బీటీ రోడ్డు పరిస్థితి ఇది.కోరుకొండ – నాగంపల్లి మధ్య ఇటీవలే లక్షలు ఖర్చు చేసి వేసిన బీటీ రోడ్డు ఐదు నెలలు కూడా నిలవలేదు. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా రోడ్డు ఒక చోట ముక్కలు ముక్కలుగా మారి మొసలి చర్మాన్ని తలపిస్తోంది.తూతూ మంత్రంగా రోడ్డు వేసి బిల్లులు కాజేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ నాణ్యత లోపమా? అధికారుల పర్యవేక్షణ లోపమా? అన్నది ప్రజల ప్రశ్న.ఈ రోడ్డుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కేజీబీవీ కళాశాల అభివృద్ధికి దాతల సహకారం

ఆత్మకూరు పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ. సత్యనారాయణ రెడ్డి చొరవ తీసుకున్నారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన బొలెరో, ఐచర్ వాహనాల యజమానుల సహకారంతో కళాశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.విద్యార్థినుల సౌకర్యార్థం 30 ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. కళాశాల ఆవరణలో మురుగునీటి పారుదల సమస్య పరిష్కారానికి సుమారు 800 మీటర్ల మేర డ్రైనేజీ కాలువను కల్వర్టు వరకు తవ్వించారు. నీటి సరఫరా మెరుగుపరిచేందుకు కొత్త సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేసి రెండో అంతస్తుపైకి మార్చడంతో పాటు, కొత్త పైపులైన్లు, నీటి కనెక్షన్లు ఏర్పాటు చేయించారు.అదేవిధంగా 18 బాత్రూంలకు తలుపులు, ట్యూబ్‌లైట్లు, నీటి కుళాయిలు ఏర్పాటు చేసి, రంగులు వేయించడంతో పాటు వాష్‌బేసిన్లు అమర్చారు. విద్యార్థినులు సౌకర్యవంతంగా చదువుకోవడానికి, రాసుకోవడానికి వీలుగా 78 సింగిల్ మెటల్ ఫ్రేమ్‌లపై చెక్క పలకలను బిగించారు. అదేవిధంగా విద్యార్థులు కూర్చోవడానికి వీలుగా చెక్క బల్లలను విద్యార్థుల సౌకర్యార్థం తయారు చేయించారు. వీటన్నింటినీ కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్యామల ఎంఈఓ 2 అయూబ్ అహ్మద్ లకు అందజేశారు.ఈ సందర్భంగా కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల మాట్లాడుతూ.. విద్యార్థినుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిన ఎంవీఐ ఏ. సత్యనారాయణ రెడ్డి, సహకరించిన వాహన యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రభుత్వ పాఠశాల నిరుపేద విద్యార్థినిల భవిష్యత్తు కోసం ఎం.వి.ఐ. ఏ సత్యనారాయణ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వమే అండ

సత్తెనపల్లి, స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు షేక్ జానీ సైదా ముస్లిం మైనారిటీ నాయకులతోప్రజావేదిక నందు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. చంద్రబాబు నాయుడు గారు గతంలో మైనారిటీలకు ఎన్నో పథకాలు అమలు చేశారని, రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, విదేశీ విద్య, మసీదుల అభివృద్ధికి నిధులు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వం దే అని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుందని, కూటమి ప్రభుత్వం మాత్రం వారి అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు మైనారిటీ యువత విద్య, ఉద్యోగాలకు పెద్దపీట వేస్తున్నాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీలు కూటమికి అండగా నిలవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు షేక్ జానీ సైదా మాట్లాడుతూ, పార్టీలో మైనారిటీలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత ఇస్తున్నామని, స్థానిక సంస్థల్లో మైనారిటీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ నాయకులు కూటమికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

కరీంనగర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదల మరియు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహార పథకం కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. కరీంనగం లోని ఏఎంసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రీకృత వంటశాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

అప్పటి నుంచి హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా అల్పాహారాన్ని సిద్ధం చేసి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు.సెప్టెంబర్ 16వ న ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం జిల్లాలోని ఏడు మండలాల్లో ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల మరియు మోడల్ పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల హాజరు శాతంలో మెరుగుదల కనిపిస్తోంది. ఉదయం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందించడం వల్ల వారు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరుకావడానికి, తరగతి గదుల్లో ఏకాగ్రతతో విద్యను అభ్యసించడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది.విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఆహార పదార్థాల నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షితమైన ఆహార తయారీ మరియు సమయానికి పాఠశాలలకు అల్పాహారం చేరవేయడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. కేంద్రీకృత వంటశాల నుంచి పాఠశాలల వరకు సమర్థవంతమైన లాజిస్టిక్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ పథకం ద్వారా విద్యార్థుల పోషకాహార అవసరాలను తీర్చడంతో పాటు, పాఠశాలల పట్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించవచ్చు. తద్వారా విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరుగుదల, డ్రాప్‌అవుట్ల తగ్గింపు మరియు విద్యా ఫలితాల మెరుగుదలకు దోహదపడుతుంది.ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా వచ్చే సోమవారం నుంచి తిమ్మాపూర్ మండలంలో కూడా అల్పాహార పంపిణీ ప్రారంభించనున్నారు.ఈ నెలాఖరులోగా కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది.విద్యార్థుల ఆరోగ్యం, విద్య మరియు ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలకు విస్తరించి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన అల్పాహారం అందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ, సంబంధిత అధికారులు మరియు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

విశాఖపట్టణం, అక్టోబరు 30 విశాఖ పోర్టు ట్రస్ట్ పరిధిలో ఈ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలో ఉన్న జేఎం భక్షి కంపెనీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో పోర్టు సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.వివరాల్లోకి వెళితే, మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్‌పై ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగసిపడటంతో పాటు, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ పోర్టు ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.కన్వేయర్ బెల్ట్ వద్ద జరుగుతున్న వెల్డింగ్ పనుల కారణంగా చెలరేగిన నిప్పురవ్వలే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదపు అంచున పందెము వాగు బ్రిడ్జి

అధికారులు వెంటనే స్పందించాలి
బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు
అందె లక్ష్మణ్ రావు

హైద్రాబాద్ అక్టోబర్ 30; సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు అంతర్గతంగా నార్సింగి సర్కిల్ కు అనుసంధానంగా మణికొండ, పుప్పాలగూడ పైప్ లైన్ రోడ్డులో రాత్రి పగలు తేడా లేకుండా పూర్తి స్థాయిలో వాహనాల రద్దీతో కొనసాగుతున్నదీ.

అట్టి మార్గ మధ్యలో పందెము వాగుపై కట్టిన బ్రిడ్జి బీటలువారి, కృశీగిపోయి ప్రమాదకరంగా మారినను సంబందిత అధికారులు స్పందించక పోవడం వింతగా గోచరిస్తుంది, గతంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గోల్డెన్ టెంపుల్ ముందు 2021 సెప్టెంబర్ 25 శనివారం రాత్రి పేరుకు స్టామ్‌వాటర్ లైన్ వేస్తు ఉండగా (అదికాస్తా ప్రస్తుత తరుణంలో డ్రైనేజీ లైన్ గా రూపాంతరం చెందినది) దానిలో పవర్ ప్లాంట్ ఇంజనీర్ రజనీకాంత్ ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యారు (పరమపదించారు) ఇట్టి దుర్ఘటన జగమెరిగిన సత్యం కాగా మళ్లీ అటువంటి అనుకోని దుర్ఘటన పందెము వాగు బ్రిడ్జిపై చోటు చేసుకునె పరిణామం మెండుగా ఉన్నధని అందుకు సంబందిత అధికారులు వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భాను చందర్ డిమాండ్ చేస్తున్నారు.

అర్హుడైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

అర్హుడైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

హైదరాబాద్ అక్టోబర్ 30: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేరును

నమోదు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టసభలలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధిని ఎన్నుకునేందుకు ఒక ముఖ్యమైన అవకాశమని సాయి చౌదరి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల భాగస్వామ్యం పెరగాలంటే ప్రతి అర్హుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నవంబర్ 6 తో ఓటరు నమోదు ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు చివరి వరకు వేచి ఉండకుండా దరఖాస్తు చేసుకోవాలని ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు విలువైనదని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైర్మన్ సాయి చౌదరి కోరారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగాఅందే శ్రీశైలం కురుమ

హైదరాబాద్ అక్టోబర్ 30.. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా బాగ్ అంబర్పేట్ కు చెందిన అందే శ్రీశైలం కురుమనియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యసదేశాల మేరకుసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్, ర్యాగ అరుణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు . ఈ సందర్భంగా అందే శ్రీశైలం కురుమ మాట్లాడుతూ బీసీ వర్గాల సంక్షేమం హక్కుల పరిరక్షణ సంఘం బలోపేతానికి బాధ్యతాయుతంగా కృషి చేస్తా నన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు ఆర్ కృష్ణయ్యకు అందె శ్రీశైలం కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం అంబర్పేట్ కురుమ సంఘం జోన్ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్ కురుమ సంఘం హాస్టల్ జాయింట్ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్ కురుమ సంఘం యొక్క రాష్ట్ర సెక్రటరీగా గత పది సంవత్సరాలు కురుమ సంఘానికి సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం బాల గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర యువత అధ్యక్షులుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ 93 బిసి కులాల ఐక్యవేదిక ద్వారా కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. నేషనల్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణయ్య అధ్యక్షతన పనిచేస్తూ ఉద్యమాలలో పనిచేస్తూ తనకంటూ గుర్తింపు పొందారు.అతని సేవలు గుర్తించిన ఆర్.కృష్ణయ్య శ్రీశైలం ను నేషనల్ కార్యదర్శిగా నియమితులయ్యారు.

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా గారిని కలిసిన NHM ఉద్యోగుల సంఘం నేతలు

హైద్రాబాద్ అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజానర్సింహాని హైదరాబాద్ లో మినిస్టర్ క్వాటర్స్ లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంధం రాములు గారి ఆధ్వర్యంలో చీఎవీ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి కలిసారు. ఈ సందర్భంగా గత 18 రోజులుగా తెలంగాణ రాష్ట్రం లో NHM ఉద్యోగుల నిరవధిక సమ్మె పై చర్చించడం జరిగింది. NHM ఉద్యోగుల సమ్మె పై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యలు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకోపోతానని హామీ ఇచ్చారు.అలాగే సమ్మె పరిస్కారం కోసం నవంబర్ 2వ తేదిన మరో సారి భేటీ అయి సమస్యలు పరిష్కారం కోసం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఎవీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు డా. బి. సంజీవ్ నాయక్, డా. కరుణాకర్, డా. కుమార్ నాయక్, డా. రాజేశ్వర్, డా. నాగరాజు, డా. పుష్పలత, ఓయూ జేఏసీ చైర్మన్ డా. పురుషోత్తం పాల్గొన్నారు.

తాగునీటికి ముప్పు.. భూగర్భజలాలకు రక్షణ!

(హెచ్. ప్రతాప్)

తెలంగాణలో భూగర్భజలాల నిల్వలు తగ్గిపోతుండటం, వర్షపాతం లోటు పెరగడం ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెలల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం కావచ్చన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి చేరిన ప్రాంతాల్లో తాగునీటియేతర అవసరాలకు వాటి వినియోగాన్ని నియంత్రించాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడే అవకాశముంది.

రాష్ట్రంలో సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 33 జిల్లాల్లో 18 జిల్లాలు వర్షపాతం లోటును ఎదుర్కొంటున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం 358 మండలాల్లో కరవు పరిస్థితులు తలెత్తే అవకాశముండగా, 324 మండలాల్లో భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రధాన జలాశయాల్లో మొత్తం 470 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి సుమారు 170 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అక్టోబర్ 24న వెల్లడైంది.

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోనూ భూగర్భజలాలు గణనీయంగా తగ్గాయి. రంగారెడ్డి జిల్లాలో సెప్టెంబర్ చివరినాటికి సాధారణంగా నమోదుకావాల్సిన 547.8 మిల్లీమీటర్ల వర్షపాతానికి బదులుగా 468 మిల్లీమీటర్లే కురిసింది. గత ఏడాది సెప్టెంబర్‌లో సగటున 6.31 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ఈ ఏడాది అదే నెలలో 11.74 మీటర్ల లోతుకు పడిపోయాయి. పరిశీలించిన 27 మండలాల్లో 26 మండలాల్లో నీటిమట్టాలు తగ్గడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఈ నేపథ్యంలో తెలంగాణ నీరు, భూమి, చెట్ల చట్టం--2002లోని 9, 10 సెక్షన్ల ఆధారంగా నియంత్రణ చర్యలు చేపట్టే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ప్రమాదకర ప్రాంతాల్లో కొత్త బోరుబావుల తవ్వకాలను నిషేధించడం, అక్రమంగా భూగర్భజలాలను తోడేవారికి రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానాలు విధించడం వంటి చర్యలు ప్రతిపాదనలో ఉన్నాయి. ఆంక్షలను తొలుత ఆరు నెలలపాటు అమలు చేసే అవకాశముంది.

మరోవైపు, హైదరాబాద్‌లో నవంబర్ ఒకటో తేదీ నుంచి నిర్మాణాలు, పార్కుల నిర్వహణ, రహదారుల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధిచేసిన మురుగునీటిని వినియోగించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక గ్రీన్ వాటర్ ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

నీటి కొరత తీవ్రమయ్యాక పరిష్కారాలు వెతకడం కంటే ముందుగానే వనరులను సంరక్షించడం అత్యవసరం. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పునరుద్ధరణ, నీటి వృథా నివారణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి. నేటి నీటి పొదుపే రేపటి తాగునీటి భద్రతకు అసలైన భరోసా.

రాఘవేంద్ర నగర్ కాలనీ పేస్ -2 అభివృద్ధి కి నిధుల మంజూరు

రంగా రెడ్డి అక్టోబర్ 30;రంగారెడ్డి జిల్లా జిలేల గూడ పరిధి లోని రాఘవేంద్ర నగర్ కాలనీ పేస్ -2 అభివృద్ధి కి కోట 5 లక్షల నిధులుUFIDC నిధులు మంజూరు చేసినట్లు TUFIDC చైర్మన్ చల్ల నరసింహారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి నిధులతో కాలనీలోని రోడ్లుడ డ్రైనేజీ నాణ్యతతో కూడిన పనులు చేయించుకోవాలని చూచించారు. అలాగే కాలనీ కమ్యూనిటీ హాల్ పక్కా భవనం నిర్మాణం కోసం తన వంతు సాయం చేస్తానని మాట ఇచ్చారు.

ఈ కార్యక్రమం కాలనీవాసి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో డీజిల్ ప్రెసిడెంట్ లు చల్ల బాల్ రెడ్డి, సిద్దల శ్రీశైలం, సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎరుకల వెంకటేష్ గౌడ్, ఐత రాజు భాస్కర్, సంతోష్ కుమార్, పరుశురాం, సైదులు యాదవ్, మురళి గౌడ్, రవీందర్. మరియు కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ సిద్ధల అంజయ్య గారు, ఏ రవీందర్ రెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, అల్లం పెల్లి అశోక్, మంద చంద్రశేఖర్ రెడ్డి, జూలూరు మనోహర్ గుప్త, అల్లం పెల్లి నరేష్, విశ్వేశ్వరయ్య గుప్త, నాగ శంకర్ గుప్తా, దామర శేఖర్, కంది శ్రీను, బాలరాజు, మల్లేష్, వెంకట్ నారాయణ చారి, శేఖరా చారి, హరి ప్రసాద్, సతీష్ గుప్తా, జగదీశ్ చారి, కోటేశ్వర్, శ్రీనివాస్, రజనీష్, రమేష్, గోపి నాయక్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఈసీ అనుమతి..

విజయవాడ, అక్టోబరు 30 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించి కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు మాత్రమే వాటిని పంపిణీ చేయాలని స్పష్టం చేసింది.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, పింఛన్ల లబ్ధిదారుల జాబితాలో ఎలాంటి కొత్త పేర్లను చేర్చరాదని, అలాగే పింఛను మొత్తంలో ఎటువంటి మార్పులు చేయరాదని ఎస్ఈసీ తన ఆదేశాల్లో పేర్కొంది. నగదు విత్‌డ్రా చేయడం నుంచి పంపిణీ వరకు మొత్తం ప్రక్రియను అధీకృత ప్రభుత్వ సిబ్బంది మాత్రమే చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణాధికారి సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. పింఛన్ల పంపిణీ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషన్ హెచ్చరించింది. ఈ నిర్ణయంతో ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా, లబ్ధిదారులకు పింఛన్లు అందేందుకు మార్గం సుగమమైంది.

23వ అంతస్తు నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబరు 30 హైదరాబాద్ నగరంలోని కోకాపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, కోకాపేట్‌లోని ప్రెస్టీజ్ బ్రౌలీ హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో వెంకటేశ్వర్లు తన కుటుంబంతో నివాసముంటున్నారు. ఆయన కుమార్తె లాస్య లహరి (15) మాదాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం లాస్య కళాశాలకు వెళ్లకపోవడంతో ఆమె తల్లి మందలించినట్లు తెలుస్తోంది.తల్లి మందలింపుతో లాస్య తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తుపైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం తల్లి మందలించడం వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడిందా? లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మేడిగడ్డ శ్రీశైలం తెలంగాణకు కరువు ఎందుకు వచ్చింది అనే అంశంపై రౌండ్ సమావేశం

తెలంగాణ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మేడిగడ్డ శ్రీశైలం తెలంగాణకు కరువు ఎందుకు వచ్చింది అనే అంశంపై రౌండ్ సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు సీనియర్ జర్నలిస్టులు రిటైర్డ్ ఇంజనీర్లు ఫోరం సభ్యులు అగ్రికల్చర్ ప్రొఫెసర్లు హాజరయ్యారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముందస్తు జాగ్రత్తగా చర్యలు తీసుకోపోవడంతోనే తెలంగాణకు కరువు వచ్చిందని అన్నారు. ప్రభుత్వము కరువు పై దృష్టి సారించకుండా రాజకీయాల పైన దృష్టి సారించి ప్రజలందరినీ కరువులు ముంచిందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కరువు వచ్చిన విధానంపై వివరించారు. సమైక్య ఆంధ్రలో కరువుపై పాడుకున్న పాటలే మళ్లీ ఇప్పుడు పాడుకోవాల్సిన సమయం వచ్చిందని బాధను వ్యక్తం చేశారు. ఇప్పటికీ కన్నెపల్లి పంబోతు నుంచి నీళ్ళని ఎత్తిపోయే అవకాశం ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ముందుగా ఆ పని చేయాలని రిటైర్డ్ ఇంజనీర్లు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులే ప్రస్తుతం తెలంగాణ కాపాడుతున్నాయని లేకపోతే అంధకారంలోకి లేదని ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఇంజనీర్ రామ్ సింగ్ ఠాగూర్ అభిప్రాయ పడ్డారు. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కరివే తప్ప ఇల్లు నూకలు కాదని పక్క రాష్ట్రాలైన ఏపీలో కర్ణాటకలో లేని కరువు తెలంగాణలో రావడానికి రేవంత్ రెడ్డి వైఖరి కారణమని పలువురు వ్యక్తులు అభిప్రాయపడ్డారు ఈ రౌడీలు సమావేశానికి రిటైర్డ్ ఇంజనీర్లు దామోదర్ రెడ్డి వెంకటేశం లతోపాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలను ఆహ్వానించిన సమావేశానికి హాజరు కాలేదని కరువు పై మాట్లాడేందుకు భయపడుతున్నారని ప్రభుత్వ తప్పులు బయటికి తెలుస్తాయని సమావేశంలో రాలేదని రెండవ సమావేశం అభిప్రాయపడింది కాంగ్రెస్ నిధుల కోసం ప్రత్యేకమైన కూర్చి వేసి నిరసన తెలిపారు. ఇవి సమావేశానికి సీనియర్ జర్నలిస్టులు బుచ్చన్న రమణ నర్రా విజయ్ హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్ట్ శివారెడ్డి వ్యాఖ్యతగా వ్యవహరించారు ఈ రెండూల్ సమావేశం ఐదు తీర్మానాలను చేసింది. ఈ తీర్మాణ కాపీలను సీఎంఓ కు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తామని వ్యాఖ్యత శివారెడ్డి వివరించారు.

1) ఎల్నినో హెచ్చరికలు ముందే తెలిసినప్పటికీ నీరు, విద్యుత్, కరవుపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఖరిని ఈ రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండిస్తోంది.

2) కరవుపై ఎటువంటి మానసిక స్థైర్యాన్ని ప్రదర్శించకుండా, పొలాలు ఎండిపోతున్న పరిస్థితుల నుంచి తక్షణమే గట్టెక్కించాలి. తెలంగాణను కరవు బారి నుంచి రక్షించాలి.

3) సాగునీరు, కరెంట్ ఇవ్వకుండా ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి విఫల పరిపాలన సాగిస్తున్నారని భావిస్తూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.

4) ఎండిపోయిన/నష్టపోయిన పంటలతో పాటు, పాడైపోయిన పంటలకు తక్షణమే ఎకరాకు ?26,000 చొప్పున రైతులకు మరియు కౌలు రైతులకు నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది.

5) కరవు బారిన పడిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి.

పంటలు వేసిన రైతులే అన్ని నష్టాలు భరించాలని రైతుల నుంచి తీసుకునే డిక్లరేషన్ ను వెనక్కి తీసుకోవాలి

ఆస్ట్రేలియాకు తాండూరు కందిపప్పు

హైదరాబాద్, అక్టోబరు 30 తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రానికి చెందిన, భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) పొందిన ప్రసిద్ధ తాండూరు కందిపప్పు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అయింది. మొత్తం 2.5 మెట్రిక్ టన్నుల పప్పుతో కూడిన మొదటి కన్‌సైన్‌మెంట్‌ను తాజాగా ఆస్ట్రేలియాకు పంపించారు. ఈ పరిణామం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ప్రాధాన్యతను, డిమాండ్‌ను చాటుతోంది.ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. "భారత జీఐ ఉత్పత్తులు ప్రపంచాన్ని గెలుస్తున్నాయి!" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎగుమతి ద్వారా భారతీయ రుచులు ఆస్ట్రేలియాలోని ఇళ్లకు చేరుతాయని, ప్రామాణికమైన భారత వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడం వల్ల రైతులు, ఎగుమతిదారులు ప్రయోజనం పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎగుమతితో తాండూరు కందిపప్పుకు సరికొత్త విదేశీ మార్కెట్ ద్వారాలు తెరుచుకున్నాయని అధికారులు తెలిపారు.తాండూరు కందిపప్పుకు 2022 డిసెంబర్‌లో భౌగోళిక గుర్తింపు లభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ పొందిన తొలి పప్పుధాన్యపు పంట ఇదే కావడం విశేషం. ఈ గుర్తింపు వల్ల ఈ ఉత్పత్తికి చట్టపరమైన రక్షణ లభించడంతో పాటు ఇతర ప్రాంతాల్లో పండే కందిపప్పుతో పోలిస్తే తాండూరు పప్పు ప్రత్యేకతను ఇది అధికారికంగా తెలియజేస్తుంది. ఈ ట్యాగ్ లభించిన తర్వాత విదేశాలకు ఎగుమతి కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.తాండూరు కందిపప్పును ప్రధానంగా వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పండిస్తారు. ఈ ప్రాంతంలోని లోతైన నల్లరేగడి నేలలు ఈ పంటకు అత్యంత అనుకూలంగా ఉంటాయి. వర్షాధార పంట అయిన తాండూరు కందిపప్పులో ప్రొటీన్ శాతం అధికంగా ఉండటంతో దీనికి మంచి డిమాండ్ ఉంది. ప్రత్యేకమైన రుచి, త్వరగా ఉడకడం వంటి లక్షణాల వల్ల దీనికి మార్కెట్‌లో మంచి పేరుంది. తాజా ఎగుమతితో స్థానిక రైతులు, ఎగుమతిదారులకు ఆర్థికంగా మరింత మద్దతు లభించనుంది.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు:

హైదరాబాద్, అక్టోబరు 30 మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్

హైదరాబాద్, అక్టోబరు 30 రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే.

కోట్లాది రూపాయిల సర్కార్ భూమిని కాపాడం

న్యూఢిల్లీ, అక్టోబరు 30 మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. సీఆర్, ఆయన కుటుంబ సభ్యుల కబ్జాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకు తమ ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మియాపూర్ లోని ఈ విలువైన భూములను విక్రయించడం ద్వారా వచ్చే నిధులను నీటిపారుదల, విద్యా, వైద్యం తదితర సంక్షేమ రంగాలకు కేటాయిస్తామని, ముఖ్యంగా విద్యారంగ అభివృద్ధికి ఎక్కువగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై త్వరలోనే క్యాబినెట్ లో చర్చించనున్నట్లు వెల్లడించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించామని వివరించారు. పూర్వపు ఐఎంజీ (ఏఓఉ) భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కేటీఆర్ కొట్టేయాలని చూస్తే న్యాయపోరాటం ద్వారా అడ్డుకున్నామని, అలాగే కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కాజేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తే కోర్టులో పోరాడి గెలిచామని పేర్కొన్నారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జా చేయాలని చూస్తే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడామని, ప్రభుత్వం వినిపించిన వాదనలతో అది అటవీ భూమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.మంచిరేవులలోని 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్ తో కలిసి కబ్జా చేయడానికి యత్నిస్తే దానిని రక్షించి, ప్రస్తుతం అక్కడ పోలీసుల పిల్లల కోసం స్కూళ్లను ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే, సుప్రీం కోర్టులో పోరాడి దాన్ని తిరిగి దక్కించుకున్నాం అన్నారు., భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నామని చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి సంక్షేమ పనులపై సమగ్ర అధ్యయనం చేస్తుందని వివరించారు.మరోవైపు హరీష్ రావు మామ హనుమంత రావు కబ్జా చేసిన భూములను సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారని, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. భూముల ఆక్రమణలపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని, కానీ శాసనసభలో దీనిపై చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగలాలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని, కనీసం రక్షించిన రెవెన్యూ అధికారులను ఎందుకు అభినందించడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీష్ రావులు అధికారంలోకి వచ్చాక ఆ భూములను స్వాధీనం చేసుకోకుండా, తాము ఎవరిపై కేసులైతే వేశారో వారితోనే లాలూచీ పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా మియాపూర్ భూములపై కుట్రలు మానాలని సీఎం హితవు పలికారు.తమ భూముల ఆక్రమణలపై, ప్రభుత్వ చర్యలపై నేరుగా చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. గతంలో రెండు గ్రామాల మధ్య ఉన్న భూవివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారని, అక్కడ జరిగిన ఆక్రమణలను తేల్చి ఆ స్థలంలో తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి పేరిట అమరవీరుల కాలనీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని కబ్జాలు చేయడం మానుకోవాలని, వారు చేసిన అక్రమాలకు వ్యతిరేకంగానే కోర్టులు వరుసగా తీర్పులు ఇస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, అక్టోబరు 30 ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు.ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

చలో ఢిల్లీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి ఢిల్లీ బయలుదేరిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, కాంగ్రెస్ నాయకులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 30 ములుగు రాహుల్ గాంధీ పిలుపుమేరకు ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మరియు జిల్లా అధ్యక్షులు సూచనల మేరకు

ఓటు మన హక్కు ప్రజాస్వామ్యం మన బలం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కును కాపాడుకుందాం

దేశాన్ని రక్షించుకుందాం

దేశం కోసం అందరం ఒకటవుదాం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం మనమంతా

ఐక్యంగా ముందుకు సాగుదాం, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఒకటో తారీఖున రామ్ లీలా మైదానంలో మహా ర్యాలీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా నుండి అధిక సంఖ్య లో ట్రైన్లో ఢిల్లీకి బయలుదేరినారు.

రాహుల్ గాంధీ దేశ ప్రధానిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగినారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గద్దల నవీన్, కన్నాయిగూడెం

మాజీ వైస్ ఎంపీపీ బుల్లె భాస్కర్, ఏటూర్ నాగారం టౌన్ యూత్ అధ్యక్షుడు బండారి లక్కీ, ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు, కొండాయి సర్పంచ్ ఆలం నాగార్జున్, తుపాకులగూడెం ఉపసర్పంచ్ ఆలం నాగార్జున్, కర్ల తరుణ్ కుమ్మరి కుమార్, జాడి నరేష్,

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నశ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ : చేసిన ఎమ్మార్వో

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్30 కన్నాయిగూడెంకన్నాయిగూడెం మండల కేంద్రంలో ములుగు జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ అధ్యక్షులు డా అలెం అప్పయ్య ఆదేశాల మేరకు శుక్రవారం కన్నాయిగూడెం ఎమ్మార్వో ఎండి సర్వర్ పాషా చేతుల మీదుగా నశ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ చెయ్యడం జరిగింది. ఎమ్మార్వో మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ టుబాకో గుట్కా చిగరేట్ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు . ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రెడ్ క్రాస్ ఎం సి మెంబెర్ అబ్బు సతీష్ మరియు ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు బోనాముక్కుల కాటన్ రెడ్డి తడకల ప్రతాప్ బండి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో.. ఆవిష్కరణల వైపు అడుగులు.

సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు రావాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 30 ములుగుములుగు జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం వరకు ఈ వాక్ ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమం సాగింది.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలోని ప్రతిభను వెలికితీసి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను గుర్తించి, వాటికి ఉపయోగకరమైన పరిష్కారాలను ఆలోచించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వీరేందర్, ఈడీఎం దేవేందర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత, టీజీఐసీ గ్రాస్‌రూట్ లీడ్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులైన లబ్ధిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్.

మెదక్ జిల్లా కొల్చారం మండలం (ప్రజాబలం): ప్రతినిది ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ఇట్టి

పథకం నిరుపేదలకు గుడిసెలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు అర్హులైన లబ్ధిదారులకు ఇప్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవి సింగ్ అధ్యక్షతన కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఇట్టి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకోవాలని ఇల్లు కట్టుకొని ఎడల వారికి భవిష్యత్తులో ఇలాంటి పథకాలు అందబోవని లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు.ప్రభుత్వం ఇచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం మరియు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ లబ్ధిదారులకు హితబోధ చేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులకు అధికారులకు శాలువాలతో లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్ చారి, హౌసింగ్ ఏఈ సుష్మ,పంచాయతీ కార్యదర్శి మౌనిక జిపిఓ పద్మ, ఉప సర్పంచ్ వెంకట నరసింహులు, గణపురం సర్పంచ్ మధుసూదన్ రెడ్డి,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యేసు రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మయ్య, మండల నాయకులు రాయన్న, రాములు, మాజీ ఉపసర్పంచ్ గొల్ల వనజ పాండరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు చిత్తారి సంతోషిని భాస్కర్, గంగ స్వామి, దుర్గయ్య,ప్రసాద్, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ. యువ నాయకులు వడ్ల గణేష్, చిత్తారి సురేష్ మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

రహదారి భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

బాణసంచా దుకాణాలకు అనుమతుల జారీలో నిబంధనలు పాటించాలి.

జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 30 ములుగు జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో రహదారి భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, బాణసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించాలని అధికారులకు సూచించారు.

మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు, యువతకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. యువత వ్యసనాల బారిన పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు అగ్నిమాపక శాఖతోపాటు సంబంధిత శాఖల నుంచి నిరభ్యంతర ధ్రువపత్రాలు పొంది, వాటి ఆధారంగా జిల్లా కలెక్టర్ నుంచి తాత్కాలిక లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అనుమతుల జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైసెన్సులు పొందిన తర్వాతే అనుమతించిన ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాద నివారణ పరికరాలు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యాపారులు భద్రతా నిబంధనలు పాటిస్తున్నారో లేదో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవీందర్, ఆర్ అండ్ బి అధికారి శ్యామ్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, రవాణా శాఖ అధికారి ఈశ్వర్ సింగ్ ఠాకూర్, డీఎఫ్ఓ నాగరాజు, కలెక్టరేట్ పర్యవేక్షకులు మహేష్ బాబు, మున్సిపాలిటీ కమిషనర్ సంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షంకే ఇబ్బందులకు గురైన ప్రజలు

గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 30 అక్టోబర్ 2026 గత 2021 సెప్టెంబర్ 25 శనివారం రాత్రి గోల్డెన్ టెంపుల్ ముందు పేరుకు స్టామ్‌వాటర్ లైన్ వేస్తు ఉండగా (అదికాస్తా ప్రస్తుత తరుణంలో డ్రైనేజీ లైన్ గా రూపాంతరం చెందినది) దానిలో పవర్ ప్లాంట్ ఇంజనీర్ రజనీకాంత్ ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యారు (పరమపదించారు) ఆ స్థలం ప్రక్కనే ఉన్న శారద కళ్యాణ మండపం ముందు చిన్న పాటి వర్షంకే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎల్ నినో తీవ్రతపె జరిగే నష్టాల పె రైతులకు అవగాహన

ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల, జి జంబులదిన్నె గ్రామాలలో శుక్రవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. పొలం సంరక్షణలో భాగంగా రైతులకు జొన్న, మినుము, శనగ, కంది పంటల గురించి యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ,ఎల్ నినో తీవ్రత కలిగే నష్టాన్ని తగ్గించుకోవడం గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖీంఖీా శాస్రవేత్తలు నీలిమ,వెంకటరమణ మరియు రాష్ట్రంవెంద్ర,డిడిఏ చెన్నమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

29వ వార్డులో టీడీపీ అభ్యర్థి ఖాజా ఇంటింటి ప్రచారం

ఆత్మకూరు, అక్టోబర్ 30 ఆత్మకూరు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 29వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఖాజా తరఫున తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రచార కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ టీడీపీ అభ్యర్థి ఖాజాకు మద్దతు ఇవ్వాలని కోరారు. వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వై. తిమోతి, మహిళలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పందెమువాగు బ్రిడ్జి కుంగి బీటలు వారింది

గండి పేట మండలం ప్రజా బలం ప్రతి నిధి 30 అక్టోబర్ 2026సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు అంతర్గతంగా నార్సింగి సర్కిల్ కు అనుసంధానంగా మణికొండ, పుప్పాలగూడ పైప్ లైన్ రోడ్డులో రాత్రి పగలు తేడా లేకుండా పూర్తి స్థాయిలో వాహనాల రద్దీతో కొనసాగుతున్నదీ. అట్టి మార్గ మధ్యలో పందెము వాగుపై కట్టిన బ్రిడ్జి బీటలువారి, కృశీగిపోయి ప్రమాదకరంగా మారినను సంబందిత అధికారులు స్పందించక పోవడం వింతగా గోచరిస్తుంది, గతంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గోల్డెన్ టెంపుల్ ముందు 2021 సెప్టెంబర్ 25 శనివారం రాత్రి పేరుకు స్టామ్‌వాటర్ లైన్ వేస్తు ఉండగా (అదికాస్తా ప్రస్తుత తరుణంలో డ్రైనేజీ లైన్ గా రూపాంతరం చెందినది) దానిలో పవర్ ప్లాంట్ ఇంజనీర్ రజనీకాంత్ ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యారు (పరమపదించారు) ఇట్టి దుర్ఘటన జగమెరిగిన సత్యం కాగా మళ్లీ అటువంటి అనుకోని దుర్ఘటన పందెము వాగు బ్రిడ్జిపై చోటు చేసుకునె పరిణామం మెండుగా ఉన్నధని అందుకు సంబందిత అధికారులు వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భాను చందర్ డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూకట్‌పల్లిలో పర్యావరణ సుస్థిరతపై అవగాహన..

కూకట్‌పల్లి(ప్రజాబలం)అక్టోబర్ 30 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి లోని లైఫ్ సైన్సెస్ విభాగం ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ సుస్థిరత (ఎన్విరాన్మెంటల్ సూస్తాయినాబిలిటీ) అనే అంశంపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, నీటి నిర్వహణ, కాలుష్య నియంత్రణ పర్యావరణ హితమైన జీవన విధానాల ప్రాముఖ్యతపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తులుగా పాల్గొన్న 1)డా. పి. నారాయణరావు, మాజీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధ్యక్షులు, ఇజఫ్

2)ఇంజినీర్ జి. కొండలరావు, విశ్రాంత చీఫ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ విభాగం కార్యదర్శి, ఇజఫ్ ;

3)ఇంజినీర్ బి. ధన్య, ఎండీ, ఫ్లోడగార్డ్ (స్టార్టప్) కమ్యూనికేషన్స్ అసోసియేట్, ఇజఫ్ ;

4) పి. నిర్మల సాంబమూర్తి, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సంయుక్త కార్యదర్శి, ఇజఫ్ తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వక్తలు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీరు విద్యుత్తును పొదుపుగా వినియోగించడం, మొక్కలను నాటడం, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడం వంటి చర్యల ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. పర్యావరణ సమస్యల పరిష్కారంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అలాగే పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలు సామాజిక భాగస్వామ్యం ఎంతో అవసరమని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ .చందన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. విద్యార్థులు పర్యావరణ స్పృహను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, పర్యావరణ హితమైన అలవాట్లను పాటిస్తూ సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, ప్రకృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో బీఎస్సీ లైఫ్ సైన్సెస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్, వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. టి. ఉత్తర ఫల్గుణి, జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. గోపాల్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ సుస్థిరతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి, ప్రకృతి పరిరక్షణకు బాధ్యతాయుతమైన పౌరులుగా వారిని తీర్చిదిద్దడంలో ఈ వర్క్‌షాప్ కీలకంగా నిలిచింది.

పట్లూర్ వసతి గృహంలో విద్యార్థులకు బెడ్ షీట్లు పంపిణీ చేసిన వసతి గృహ అధికారి తులజ రామ్ గౌడ్

వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ వసతి గృహంలో విద్యార్థులకు బెడ్ షీట్స్ పంపిణీ చేసిన వసతి గృహ అధికారి వికారాబాద్ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుల్జారామ్ గౌడ్, విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం సిద్ధపరిచి ఇవ్వడం జరుగుతుంది అదేవిధంగా ఇరేగ్యులర్ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వెంటనే విద్యార్థులను ఫాలోఅప్ చేయడం జరుగుతుందని వసతి గృహ అధికారి తుల్జారామ్ గౌడ్ తెలిపారు విద్యార్థుల ఉదయం సాయంత్రం హాజరు పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నియమించి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు వసతి గృహంలో విద్యాబోధన నిర్వహించడం జరుగుతుందని వసతి గృహ అధికారి తుల్జారాం గౌడ్ తెలిపారు విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యాపట్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు ఈ కళ నిజం చేయాలని మా వంతు కృషి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని వసతి గృహ అధికారి వికారాబాద్ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుల్జారం గౌడ్ తెలిపారు

ఘనంగా అయ్యాచార దీక్షల మహోత్సవం

సిద్ధేశ్వరాలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

జహీరాబాద్, అక్టోబర్ 30 ప్రజాబలం ప్రతినిధి: పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యాచార దీక్షల మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది.

మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా శుక్రవారం తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, దీక్షా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహోత్సవంలో భాగంగా ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం పంచాచార్యులు, అష్టదిక్పాలకులకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు నవగ్రహాది సర్వదేవతల హవనాలను వేదోక్తంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల అనంతరం ధనసిరి హిరేమట్ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో అయ్యాచార దీక్షల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మహాస్వామివారు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. జంగమ సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలు మరో రోజులపాటు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, అయ్యాచార దీక్షాపరులు, జంగమ సమాజం ప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్లూర్ గ్రామప్రజల క్షేమమే నా లక్ష్యం ,గ్రామ సర్పంచ్ పరుశు రాం

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ గ్రామ ప్రజల అభివృద్ధి నా లక్ష్యం అని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారుపట్లూర్ గ్రామంలో బోర్ పంపు సరిగా పనిచేయడం లేదని తెలుసుకున్న గ్రామసర్పంచ్ పరుశురాశీ వెంటనే స్పందించి టెక్సమో కొత్తబోర్ మోటారు తెచ్చి పని వారిని పిలిపించి వెంటనే మరమ్మతు ప్రారంభించడం జరిగిందని తెలిపారు గ్రామంలో కావాల్సిన కనీస అవసరాలు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ఎల్లవేళలా నా వంతు కృషి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు

కొటపల్లి పోలీస్ స్టేషన్ లో ఆలయ పౌండేషన్ చే ఉచిత "ఐ" క్యాంపు సేవలు

పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబరు-30, ప్రజాబలం ప్రతినిధి : ఆలయ పౌండేషన్ ఆధ్వర్యంలో కోటపల్లి మండల పోలీస్ స్టేషన్లో పోలీస్ శాఖ తరపున ఐ క్యాంపు ఏర్పాటు చేశారు. ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సిఈఓ మిట్టపల్లి రాజేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఐ క్యాంపులో ఆలయ ఫౌండేషన్ సేవలు విద్య, వైద్యం, ఉపాధి తదితర సేవలపై వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణ, ఎస్ఐ రాజశేఖర్ లకు పౌండేషన్ ప్రతినిధులు శాలువాలతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో పరికిపండ్ల నరహరి ఐఏఎస్ రచించిన ఓబిసి పోరుబాట పుస్తకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సిఈఓ మిట్టపల్లి రాజేంద్ర కుమార్, రాసపెల్లి రవి కుమార్, అలమర్తి శిరీష్, కమటం కిరణ్ కుమార్, తదితరులు పాల్గోన్నారు.

నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించిన బేరి రామచందర్ యాదవ్

గచ్చిబౌలి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 30 నల్లగండ్ల నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించారు కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. నేతాజీ నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుండి మురుగునీరు ఇండ్లలోకి వస్తుందని కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జలమండలి అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం సూపర్వైజర్ సురేష్ కి సమాచారం ఇవ్వగా వారు సిబ్బందిని పంపించి కాలనీలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యని దగ్గరుండి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, అసోసియేషన్ సభ్యులు కాలనీ సభ్యులు శంకర్ నాయక్, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, రాంబాబు నాయక్. సమస్యను జలమండలి సిబ్బంది అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీటి సమస్యను పరిష్కరించారు.

అందోల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఎంక్వయిరీ ఎన్ని సార్లు

నాన్ లోకల్ లబ్ధిదారులకు ఏ రకంగా డబుల్ బెడ్ రూమ్ మంజూరు భూస్వాములకు సొంత భవనాలు ఉన్న వారికి ఎలా కేటాయించారు

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా : ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అందోల్ గ్రామంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను, ఎన్నిసార్లు ఎంక్వయిరీ చేస్తారు, మీరు కేటాయించిన ఇండ్లలో, ఎంతమంది లబ్ధిదారులు స్థిర నివాసం ఉంటున్నారు ఇందులో ఎంత మంది కిరాయికి ఉంటున్నారు, మీ ఎంక్వయిరీలో ఇవేమీ వెలుగు చూడలేదా, మీ నిజమైనఎంక్వయిరీ, తేలేందుకు ఎంత సమయం పడుతుంది, మీకు అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, నిజమైన లబ్ధిదారులకు, అధికార పూర్వకంగా, వాళ్లను గుర్తించి, వాళ్లకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించండి, నిజమైన న్యాయం చేయాలని, అందోల్ గ్రామ నిరుపేద కుటుంబాలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.....

అక్టోబర్ మాసంలోనే డెడ్ స్టోరేజ్ దిశగాసింగూర్ ప్రాజెక్ట్

వర్షాకాలంలోనే తగ్గుతున్న నీటి నిల్వలు భవిష్యత్తులో తాగునీటి కష్టాలు తప్పవా

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా : పుల్కల్ మండల పరిధిలోని మంజీరా నది నీటి ప్రవాహం తగ్గిపోవడంతో, సింగూరు ప్రాజెక్టులో నీటి నిలువలు, క్రమంగా తగ్గి వెలవెలబోతున్నాయి, ఒకప్పుడు సమృద్ధిగా నీటితో కళకళలాడిన సింగూర్ ప్రాజెక్టు, ప్రస్తుతం నీరు లేక వేలవేల పోతుండడంతో, ఆందోళన కలిగిస్తోంది, ప్రాజెక్టులో నీటిమట్టం తరచూ డెడ్ స్టోరేజ్ దిశగా పయనిస్తుండడంతో, భవిష్యత్తులో తాగునీటి అవసరాలపై, ప్రజలు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు

మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 భూములు ప్రభుత్వానివే - సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎంసీపీఐ (యు) హర్షం

మియాపూర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 30 మియాపూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 100, 101లోని 550.39 ఎకరాల భూమి ప్రభుత్వ భూమేనని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఎంసీపీఐ (యు) హర్షం వ్యక్తం చేసింది. మియాపూర్, ముజఫర్ అహ్మద్ నగర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకత్వం ఈ విషయాన్ని తెలిపింది.

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 100, 101లోని భూమి ప్రభుత్వ భూమి అని ఎంసీపీఐ (యు) నాలుగు దశాబ్దాలుగా చెబుతూ వస్తుందని తెలిపారు. 1986లో శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయాలని ప్రజా పోరాటం చేస్తున్న క్రమంలో మియాపూర్ 100, 101లోని 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని, ఈ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పహాణీలో తమ పేర్లను నమోదు చేసుకుని కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ భూమిని కబ్జాదారుల నుండి రక్షించాలని అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించామని గుర్తు చేశారు. 1994లో ఎంసీపీఐ (యు) వ్యవస్థాపక నేత, అప్పటి శాసనసభ్యులు మద్దికాయల ఓంకార్ ఈ భూములపై శాసనసభలో చర్చ పెట్టారని, ఆ క్రమంలో రఫీ మునిసా బేగం వారసులు, రహీమున్నీసా బేగం వారసుల మధ్య వివాదం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. వీరిద్దరూ ఈ భూమిని వివిధ భాగాలుగా ప్రైవేటు సొసైటీల పేరిట విక్రయించారని, ఈ విషయాన్ని అనేకసార్లు ప్రభుత్వాలకు తెలియజేశామని పేర్కొన్నారు. 1994-95లో ఇరువురు, ప్రైవేటు సొసైటీలు కోర్టుకు వెళ్లగా, తదనంతరం ప్రభుత్వం ఇన్వాల్వ్ అయ్యి 2003లో ఇది ప్రభుత్వ భూమేనని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం కంటే ముందే ఎంసీపీఐ (యు) ఈ భూమి ప్రభుత్వ భూమి అని తెలియజేసిందని, దీన్ని కాపాడుకునేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.

కబ్జాదారుల నుండి భూమిని కాపాడే క్రమంలో సర్వే నంబర్ 100లో స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్ లలో మద్దికాయల ఓంకార్, తాండ్ర కుమార్ నాయకత్వంలో అనేక మందికి ఇళ్ల స్థలాలు కల్పించామని తెలిపారు. వాటికి చట్టబద్ధత కోసం ప్రభుత్వాలతో పోరాడుతున్నామని, మిగిలిన వందలాది ఎకరాలను వివిధ సొసైటీల పేరుతో, వ్యక్తిగత కబ్జాదారులు కబ్జా చేశారని ఆరోపించారు. 23 ఏళ్ల తర్వాత ఇది ప్రభుత్వ భూమేనని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే క్రమంలో ఈ భూమిని ప్రజలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయాలని, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని, ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగించరాదని, సర్వే నంబర్ 100లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు ఇంటి పట్టాలు ఇచ్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే 550 ఎకరాల భూమిని విక్రయిస్తామని సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన 24 గంటలు గడవకముందే ఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూమిని అమ్మేసి అయినా ప్రజా పాలన కొనసాగిస్తామని ప్రకటించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరంలో ఇన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఉండి దాన్ని ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు అమ్మాలని ఆలోచించడం దుర్మార్గమని అన్నారు. ప్రైవేటు వ్యక్తులకు కొమ్ముకాయకుండా, భవిష్యత్ తరాల ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూమిని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనియెడల ప్రజలకు భూమి దక్కే వరకు తమ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరత్ నాయక్, పల్లె మురళి, కమిటీ సభ్యులు జి. శివాని, బీకే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వైద్య సేవలపై ఉక్కుపాదం

మూడు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో తనిఖీలు రెండు అల్ట్రాసౌండ్ యంత్రాలు సీజ్.. గెలాక్సీ ఆసుపత్రికి నోటీసు నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవు: డి ఎం ఎచ్ ఓ.డా. ఆనంద్

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 30: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహిస్తున్న సంస్థలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రజారోగ్యం, రోగుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ శుక్రవారం కూకట్‌పల్లిలోని పలు వైద్య సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమతులు, రిజిస్ట్రేషన్లు, వైద్య పరికరాల

వినియోగం, సిబ్బంది వివరాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కూకట్‌పల్లిలోని ట్రిశూల్ డయాగ్నస్టిక్స్ ప్రాంగణంలో తనిఖీ చేయగా, మెడిని కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ పేరుతో ఉన్న అనుమతులకు, ట్రిశూల్ పేరుతో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సేవలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. సిబ్బంది వివరాలు, కాలుష్య నియంత్రణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పత్రాల్లోనూ లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. అక్కడ టీఎంటీ, ఈసీజీ పరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే యంత్రాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో అల్ట్రాసౌండ్ యంత్రాన్ని సీజ్ చేశారు.

అనంతరం గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించగా, తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు ఈ ఏడాది ఏప్రిల్ 23తో ముగిసినట్లు గుర్తించారు. పూర్తి నిర్వహణ పత్రాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలతో పాటు రోగులకు అందుబాటులో ఉండాల్సిన చికిత్సా ధరల పట్టిక విషయంలోనూ లోపాలు బయటపడ్డాయి. దీంతో ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వీఎంఆర్ హాస్పిటల్స్, మెటర్నిటీ (ఓబీజీ) అండ్ సర్జికల్ సెంటర్‌లోనూ తనిఖీలు చేపట్టారు. పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన అంశాలను పరిశీలించే క్రమంలో అల్ట్రాసౌండ్ యంత్రంపై స్కానింగ్ కార్యకలాపాలను గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో యంత్రాన్ని సీజ్ చేయడంతో పాటు ఆసుపత్రికి షోకాజ్ నోటీసు ఇచ్చారు.

ఫిర్యాదు చేస్తే చర్యలులి

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధించే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం అవసరమైన అనుమతులు, రిజిస్ట్రేషన్లు, రికార్డులు నిర్వహించాలన్నారు. రోగులకు చికిత్సా వివరాలు, వైద్య సేవలు, ధరలపై పారదర్శక సమాచారం అందించాలని సూచించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం, నిబం ధనల ఉల్లంఘనలు, అక్రమాలు ఎదురైతే ప్రజలు ఆధారాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి లిఖిత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజారోగ్యం, రోగుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని, ఉల్లం ఘనలకు పాల్పడే సంస్థలపై చట్టప్రకారం చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

గత 15 సంవత్సరాలుగా అక్రమ నీటి దందా

మదీనాగూడ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 30 మదినగూడ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు కు అనుకొని ఉన్న ZEE HABITAT అనే అపార్ట్మెంట్ యజమాని రోజుకు 20 ట్యాంకర్ల చొప్పున భూగర్భ జలాలు గుంజి అమ్ముకుంటున్న వైనం సెల్లార్ లో నీళ్లు ఊరుతున్నాయనే సాకుతో నీటిని రక్తంలాగా గుంజి అమ్ముతున్న యజమాని

చుట్టుముట్టు ఉన్న కాలనీలలో బోర్లన్ని ఎండాకాలం రాకముందే ఎండిపోతున్న వైనం ఇట్టి సెల్లార్ ను మట్టితో మూసివేసి చుట్టుముట్టు కాలనీలలో బోర్లు ఎండిపోకుండా చూడవలసిన బాధ్యత గౌరవ ఎమ్మార్వో మైపాల్ రెడ్డి పై ఉందని విశ్వసిస్తున్నాము మదినగూడ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో గల జి హ్యాపీడేట్ అనే అపార్ట్మెంట్ వారు గత 15 సంవత్సరాల నుండి నిరవధికంగా లక్షల ట్యాంకర్ల నీటిని ప్రతిరోజు

20 ట్యాంకర్లు చొప్పున అమ్ముకుంటున్నారు ఇలా నీరును గుంజి అమ్ముకున్నచో చుట్టుముట్టు ఉన్నా కాలనీలలో ఉన్న బోర్లు ఎండిపోతున్నాయి వచ్చేది గడ్డుకాలం కావున గౌరవ ఎమ్మార్వో పరిశీలించి వెంటనే ఇట్టి సెల్లార్ గుంతను మట్టితో పూడ్చివేసిన చో చుట్టుముట్టు కాలనీలలో ఉన్న బోర్లు మళ్ళీ నీటితో కళకళలాడతాయని విశ్వసిస్తున్నాము వెంటనే గౌరవ ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి తమరి కింది స్థాయికి అధికారులను పంపించి పరిశీలించి వెంటనే ఇట్టి నీటి దందాను నిలిపివేయగలరని నిరంతరం ప్రజాక్షేమం కోసం పోరాడుతున్న మీ మిద్దెల మల్లారెడ్డి కోరుచున్నాను

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com